
# వీలునామా

భరణి



రఘురామయ్య దిక్కులేని చావు చచ్చాడు.

అందుకా పల్లెటూళ్ళో విచారించిన వాళ్లెవరూ లేరు. ఒకప్పుడు అతను బాగా బతికినవాడు. పట్నంలో లాయర్ వృత్తి చేసి లక్షలార్జించాడు. వృద్ధాప్యం సమీపించగానే, మకాం బస్తీనుంచి పల్లెటూరుకు మార్చాడు. పెద్దమేడ కట్టించాడు, కొంత డబ్బుతో భూములు కొని, మిగతా డబ్బు బాంకులో నిల్వచేశాడు.

తానెప్పుడు మరణించేదీ తనకే తెలియదు గనుక వీలునామా వ్రాయటం అవసరమని ఆలోచించాడు.

అతనికి భార్యా, ఓ కొడుకూ వున్నారు. మేడను భార్యకు, ఆస్తిని కొడుక్కూ పంచా లనుకున్నాడు. తన చిన్ననాటి స్నేహితుడు, తన ప్రాణానికి ప్రాణమూ అయిన రాఘవయ్యకు ఓ వేయి రూపాయలూ, ఎలిమెంటరీ స్కూలుకు మరో వేయి రూపాయలూ చెందేటట్టు వ్రాయాలి.

అనుకున్న విధంగా వీలునామా తయారుచేశాడు.

కాని అత ననుకున్న దానికి విరుద్ధంగా జరిగింది. అతనికంటె ముందు అతని భార్య స్వర్గస్థురాలవటం మూలాన, వీలునామా మళ్లా వ్రాయాల్సిన అవసరమేర్పడింది.

వడ్డీలకు యిచ్చిన చిన్న చిన్న మొత్తాలు మినహా ఆస్తంతా కొడుకు పేరట రాసేశాడు.

ఇలా నాలుగేళ్ళు గడిచాయి.

ఒకానొక రోజు రఘురామయ్య చెవిని దుర్వార్త ఒకటి వినవచ్చింది. తన కొడుకు ఎలిమెంటరీ స్కూల్లో పనిచేసే కిరస్తానీ పంతులమ్మతో పట్నానికి పారిపోయాడని!

రఘురామయ్యకు గుండె ఆగినంత పనైంది. కాని అది యినప గుండులాటిది కావటం మూలాన గాబోలు ఆగలేదు.

తన పరువు, ప్రతిష్ఠ మంట గలిపిన కొడుకుని తలచుకుని కుమిలిపోయాడు.

కొద్దిరోజుల తర్వాత క్షమాపణ కోరుతూ, తనను మళ్లా యింటికి రానివ్వవలసిందిగా బ్రతిమాలుకుంటూ కొడుకు వుత్తరం రాశాడు.

"కులం చెడినవాడివి. నువ్వు నా కొడుకువే కావు. ఇక్కడికి రావొద్దు, ఎట్టి పరిస్థితిలోనూ నీముఖం నాకు చూపొద్దు" అని నిష్కర్షగా జవాబు రాశాడు రఘురామయ్య.

వీలునామా మళ్ళా రాయవలసిన అగత్యం ఏర్పడింది. ఈ డబ్బూ, మేడా, పొలాలూ ఏంచేయాలి అని చాలసేపు ఆలోచించాడు.

డబ్బంతా స్కూలు పేరరాస్తే, అది కమిటీ మెంబర్ల కడుపులో పడటం ఖాయం.

ఎంతోదూరం ఆలోచించి తన ఆస్థియావత్తు తన ఆప్తమిత్రులైన వారందరికీ పంచిపెట్ట నిశ్చయించుకున్నాడు.

అతను అనుకున్న దానికంటె ఎక్కువ కాలం బతికాడు. బాంకులో డబ్బు నేల స్థానానికి దిగింది.

రఘురామయ్య మహావైభవంగా షష్ఠిపూర్తి జరుపుకున్నాడు. అభినందనలు పంపని వాళ్లూ, షష్ఠిపూర్తికి హాజరు కాని వాళ్లూ వారసుల లిస్టులోంచి తీసి వేయబడ్డారు.

పోగా, మిగిలింది ఐదుగురే!

ఆ ఐదుగురూ ఎప్పుడూ రఘురామయ్య వెంబడివుంటూ, అతన్ని పొగడ్తలతో ఉబ్బి తబ్బిబ్బుచేస్తూ, అతని ఉప్పు తిని బతుకుతున్నవాళ్లే.

నిజానికి తన ఆస్తిని అనుభవించటానికి వాళ్లు అర్హులా, కారా అని వారం రోజులు పరీక్షించాక గాని వీలు తయారు చేయలేదు.

ఆస్థి ఐదు సమభాగాలు చేయాలి.

పొలాలు, ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బును ఐదుగురూ సరి సమానంగా పంచుకోవాలి. ఇక సామగ్రి అమ్మి, వచ్చిన డబ్బు పంచుకున్నా సరే లేక సామగ్రినే పంచుకున్నా సరే.

ముందు హాలులోవున్న పెద్ద ఆయిల్ పెయింటింగ్ చిత్రంమాత్రం మద్రాసు మ్యూజియంకు అందజేయబడాలి.

ఈ విధంగా తాను వీలు వ్రాసినట్టు అందరితోటీ చెప్పాడు. ప్రతిరోజూ వాళ్లతో, 'నా ఆస్థంతా మీ పేరట రాసేశానోయ్' అని ఏదో ఒక సందర్భంలో అంటూనే వుంటాడు.

వాళ్లు బుజా లెగరేస్తూ, 'మీరు చాల వుదారస్వభావులండీ! లేకపోతే మాలాంటి అభాగ్యులకు ఇంత ఆస్థి ఎవరు రాసిస్తారండీ!' అని తమను తాము కించపరచుకుంటూ, అతన్ని ఆకాశాని కెత్తేవారు. అతను గర్వంగా, చిర్నవ్వు నవ్వుతూ వాళ్ల పొగడ్తలు వింటుండేవాడు.

రఘురామయ్యకు యిప్పుడు అరవై అయిదేళ్ళు - ఐనా ఉక్కు ముక్కలా వున్నాడు.

ఉన్నట్టుండి ఓసారి యిద్దరు స్నేహితులు ఏదో మాటా మాటా వచ్చి మాట్లాడటం మానేశారు. రఘురామయ్య యింటికి వెళ్లటం కూడా మానుకున్నారు. ఇది తెలిసిన రఘురామయ్య వీలునామాలో ఆ యిద్దరి పేర్లూ తీసేశాడు.

పాత వీలు చించేసి కొత్తది రాశాడు. అందులో ముగ్గురి పేర్లే వున్నాయి.

ఇద్దరు ఏదో చిన్న వ్యాపారం చేసుకుంటున్నవారు - మరో అతను పోలీస్ డిపార్ట్‌మెంటులో పనిచేసి రిటైర్ అయ్యాడు. ఈ మూడో అతను ప్రతి రోజూ తనకు రాబోయే ఆస్థిగురించి పలవరిస్తుండేవాడు. తనకు పోటీగా మరో యిద్దరు వుండటంవల్ల వచ్చే నష్టాన్ని తలచుకుని విచారించేవాడు.

బాంకులో డబ్బు తరిగిపోతూంది. ఇది తెలుసుకున్న ముగ్గురూ మనసులోనే కుమిలిపోయారు.

'ఈ ముసలాడింకా చావడేం?' అనుకునేవారు. ఇలా వుండగా ఓ దినాన పోలీసు మిత్రుడికి ఓ శుభవార్త అందింది. మిగతా యిద్దరిలో ఒకడు గుండె ఆగి మరణించాడు అని.

వీలు మళ్లా మార్చబడింది.

ఆస్థిని యిద్దరు స్నేహితులకూ రాసి, తన డెబ్బయ్యో జన్మదినోత్సవం దివ్యంగా జరుపుకున్నాడు.

ఇద్దరు స్నేహితులూ లోలోపల బాధపడసాగారు.

'ఈ ముసలి ముండాకొడుకు మనం చచ్చాకగాని చావడుగామోసు!' అని పోలీసు మిత్రుడితో వ్యాపారి అన్నాడు.

ఈ మాటలు రఘురామయ్య చెవిని పడ్డాయి. వెంటనే వీలులోంచి అతనిపేరు తీసేసి, "నువ్వు మళ్లా యీ గడపలో అడుగెట్టావంటే పీక నులిమేయిస్తాను. జాగ్రత్త!" అని వార్నింగ్ యిచ్చాడు.

ఇక మిగిలిన పోలీస్‌మిత్రుణ్ని అందరూ అభినందించసాగారు. "చాలా అదృష్టవంతుడివి" అంటూ.

రఘురామయ్య మంచం పట్టాడు.

వారసుణ్ని పిలుచుకరమ్మని మనిషిని పంపించాడు. కాని అతను ఏదో పనిలో వుండటం మూలాన రాలేకపోయాడు. దాంతో రెచ్చిపోయి —

'నా మాట ఖాతరు చేయనివాడికి నా ఆస్థి అనవసరంగా ఎందుకివ్వాలి? వాడు నా ఆస్థి అనుభవించటానికి అనర్హుడు' అనుకున్నాడు.

అయితే, ఈ డబ్బూ, ఆస్థి ఎవరికి రాసిచ్చేట్టు? ఈ ప్రపంచంలో ఎవ్వరూ నమ్మదగ్గవాళ్లుగా లేరు. ఎవరికీ విశ్వాసం లేదు. అంతా డబ్బుకోసం తన్ను ఆశ్రయించిన వాళ్లే!

చాలసేపు ఆలోచించి, ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాడు. వెంటనే అతి కష్టం మీద బండి చేసుకుని బాంకుకు వెళ్ళి, డబ్బంతా 'విత్‌డ్రా' చేశాడు.

పొలాల్ని అమ్మకానికి పెట్టి, వారం రోజుల్లో అమ్మి డబ్బు దగ్గరుంచుకున్నాడు.

మొత్తం డబ్బును చిన్నపెట్టెలో వుంచి, తలకింద పెట్టుకున్నాడు. తనదగ్గర నమ్మకంగా పనిచేస్తున్న పనివాడికి, ఐదు వందలరూపాయలు యిచ్చి పంపించేశాడు.

ఒంటరిగా, ప్రశాంతంగా చనిపోవాలి- ఇదీ రఘురామయ్య కోరిక.

పెట్టెలోని నోట్లమీద అగ్గిపుల్ల గీచి పడేశాడు—నోట్లన్నీ పూర్తిగా కాలినాక, ఇంటికి నిప్పంటించి, తను లోపలే పడుకున్నాడు!

* * *

పైరింజన్ పక్క వూళ్లోంచి రావలసి వుండటంవల్ల ఆలస్యం అయింది. ఇరుగు పొరుగు వాళ్లు యిల్లు తగలబడిపోకుండా వుండటానికి చేసిన ప్రయత్నాలు విఫలమైనాయి మేడ రూపులేకుండా పరశురామ ప్రీతి అయింది.

అయితే డాక్టర్‌కూ, వూళ్లోనివాళ్లకూ కలిగిన ఆశ్చర్యమేమిటంటే, మన కథానాయకుడు — రఘురామయ్య బతికే వున్నాడు.

కాని యిప్పుడతను లక్షాధికారికాడు- చేత నయాపైసకూడలేని నిర్భాగ్యుడు! ★

